# హోల్డాన్

గంట రెండుసార్లు మోగగానే చివరంటా కాలిన సిగరెట్ బయటకు విసిరి హారన్ రెండుసార్లు మోగించి చేతి గడియారం వంక చూసుకున్నాను. ఎనిమిదీ నలభయి అయిదయింది.

ఇంజను స్టార్టు చేసి వెనక్కి తిరగి చూశాను. ఇరవయి మంది ప్రయాణికులు కూడా లేరు. పెదకూరపాడు నుండి అది చివరి బస్సు.

ఊరు దాటుతున్నప్పుడు నాకు బస్సు హెడ్ లైట్ల మీద అనుమానం కలిగింది. ఆ పూట డిపోలో మంచి బండి ఇవ్వలేదు. దారి కూడా మంచిదేం కాదు. అన్నిటికీ మించి ఆ రూటుకు నేను కొత్త. కండక్టరు అంజనేయులకు కొత్త.

పెదకూరపాడు దాటి బస్సు నాలుగయిదు మైళ్లు నడిచిందో లేదో అంతంత మాత్రంగా వెలుగుతున్న హెడ్‌లైట్లు ఆరిపోయాయి. అప్పటికే చీకటి దట్టమయింది. దారి తెలియటంలేదు. కొద్దోగొప్పో పరిచయం ఉన్నదారి అయితే కళ్లు మూసుకుని బండి నడపగలను. నాకు కొత్త కావటం వలన ఇబ్బంది అనిపించింది. స్విచ్‌తో తంటాలు పడుతూ కష్టంమీద గుడ్డిగా బస్సును ఒక ఫర్లాంగు నడపగలిగాను. ఆపైన నడపటం తేలిక అనిపించలేదు. రోడ్డు పక్కగా నిలిపి వేశాను.

"ఏమయింది గురో?" అడిగాడు ఆంజనేయులు.

"హెడ్‌లైట్లు వెలగటం లేదురా అబ్బాయ్" అన్నాను.

ఆంజనేయులు లేచి నా దగ్గిరకు వచ్చి "ఏమయి ఉంటుంది?" అడిగాడు.

"కనక్షన్ ఎక్కడో వదులయి ఉండాలి. లేదా తెగిపోయి ఉండాలి."

"ఏమి చేయటం?"

నవ్వి, "భజనరా బాబూ, భజన. బండిని ఇక్కడాపకపోతే ఏ ప్రమాదమయినా జరిగే అవకాశం ఉంది." అని జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించాను. అద్దంలోంచి బయటకు చూస్తూ "ఆ లైట్లు కనిపిస్తున్నాయే, అదే ఊరు." అడిగాను.

"నాకు తెలవదు గురో".

"నా ఖర్మకొద్ది దొరికావు కదరా బ్రదరూ" అని వెనక్కి తిరిగి ఆడవాళ్ల సీట్లో ఠీవీగా కూర్చుని ఉన్న కళ్ల జోడాయననుద్దేశించి, "మీదే ఊరు సార్?" అడిగాను.

"పెదకూరపాడు."

"మీకీ రూటు బాగా తెలిసి ఉండాలి."

తెలుసన్నట్లు అతను తలూపుతుంటే కళ్లజోడు జారి ముక్కు చివరి వరకూ వచ్చింది.

"ఇలా రండి."

అతను కళ్లజోడు సవరించుకుని ఇబ్బందిగానే లేచివచ్చి ఆంజనేయులు పక్కన నిలబడి ఏమిటన్నట్లు చూశాడు.

"అదో కనిపిస్తుందే, ఏ ఊరది?" అడిగాను.

చెప్పాడు.

"ఇక్కడికి సత్తెనపల్లి ఎంత దూరం ఉంటుంది?"

చెప్పాడు.

ఆంజనేయులు ముఖంలోకి చూసి, "అబ్బాయ్, నువ్వోపని ఎందుకు చేయకూడదు?" అడిగాను.

"ఏమిటి."

"సత్తెనపల్లి వెళ్లి రాకూడదూ?"

"వెళ్లి?"

"సత్తెనపల్లి డిపో నుండి ఏ మెకానిక్కునో పట్టుకు వస్తేకాని మనకు మోక్షం ఉండదు."

"గురో! సత్తెనపల్లి వెళ్లిరావటం నావల్లకాదు. పోయిన నెలలో నాకు హైడ్రోసిల్ ఆపరేషన్ జరిగిన విషయం నీకు తెలుసు. నేనంత దూరం నడవలేను. ఇది ట్రంకు రోడ్డు అయితే లారీ ఏదయినా దొరుకుతుంది....." ఇలా చెప్పుకుపోతుంటే వళ్లు మండుకొచ్చింది. అదేం పాపమోగాని నాకు దొరికే కండక్టర్లెవరూ నా మాట వినిపించుకోరు. ఏం చేయాలో అర్థం కావటంలేదు. సీటు మీంచి లేచి కిందకు దిగాను. రోడ్డు మీద గాలి చల్లగా వీస్తోంది. పైకి చూశాను. చుక్కలు కనిపించటంలేదు. వర్షం రావచ్చనుకుంటాను. ఆకాశం ఉండుండి మెరుస్తోంది. ఎలా అయినా ఈ రాత్రికి ఇంటికి

చేరుకోవాలి. చిన్న పిల్లలిద్దరికీ వంట్లో బావుండలేదు. పిల్లల్ని ఆస్పత్రికి తీసుకెళ్లమని సరస్వతికి చెప్పి మందులకోసం డబ్బులు ఇచ్చివచ్చాను. తీసుకెళ్లిందో, లేదో? బస్సు ముందుకు వచ్చాను. ఇద్దరు ప్రయాణికులు హెడ్‌లైట్లను పంచుకుని పరిశీలిస్తున్న వాళ్లల్లా నేను ముందుకు రాగానే లైట్లు మీంచి చేతులు తీసేశారు.

"బస్సు ఎప్పుడు బయల్దేరుతుందండీ?" అడిగాడు ఒక పాసింజరు.

"హెడ్‌లైట్లు వెలగకపోతే ఎలాగయ్యా, నడపటం?" అన్నాను.

"ఎందుకు వెలగటంలేదో మీరు విప్పదీసి చూడొచ్చు కదా?"

"చూడకూడదు. ఏదయినా పార్టుపోతే దాని ఖరీదు నానెత్తిన రుద్దుతారు." లాగి బంపరును తందామనిపించింది. నాతోపాటు పాసింజర్లు కూడా తంతారనిపించి ఆ ఆలోచన మానుకుని విసుగ్గా తిరిగొచ్చి నా సీట్లో కూర్చోగానే కళ్లజోడు ఆసామి నా దగ్గిరకు వచ్చి, "నాదో చిన్న సలహా" ఆగి నా ముఖంలోకి చూశాడు.

"చెప్పండి."

"నాకు ఈ దారి బాగా తెలుసు. బండిలో లైట్లు వెలుగుతున్నాయి కాబట్టి కొద్దిపాటి వెలుగు ఉంది. నేను మీ పక్కన నిలబడి దారి చెబుతుంటాను. మీరు మెల్లగానే నడపండి. అనుమానంగా ఉన్నప్పుడు హారన్ కొడ్తుండండి..... ఏమంటారు?"

అతని సలహా నాకు నచ్చింది. "మీపేరేమిటి?" అడిగాను.

"అచ్యుత రామయ్య."

"మీ అయిడియా బావుంది. అలానే చేద్దాం." అని ఆంజనేయులు వంక చూసి, "కిందున్న వాళ్లను బస్సు ఎక్కమను" అని ఇంజను స్టార్టు చేశాను. అందరూ ఎక్కిన తర్వాత తలుపు వేసి "రైట్" అన్నాడు. బస్సు కదిలాక హెడ్‌లైట్ల స్విచ్‌ను రెండు మూడు సార్లు కదిపి ప్రయత్నించి చూశాను. ఫలితం కనిపించలేదు. స్విచ్‌లను ఆన్‌లోనే ఉంచి వేగం కొద్దికొద్దిగా పెంచసాగాను. నా పక్కనే నిలబడ్డ అచ్యుత రామయ్య అభయ హస్తం నాకు ధైర్యంగా ఉంది.

పావుగంటపాటు బస్సును నడిపే సరికి నా మీద నాకు నమ్మకం ఏర్పడింది. ఉండుండి మెరిసే మెరుపుల్లో కనిపిస్తున్న దారిని పట్టుకుని నడపటం బయల్దేరబోయే ముందు నేను భయపడినంతగా లేదు. కూడలి వచ్చినప్పుడు దారి చీలుతున్నప్పుడు అచ్చుత రామయ్య మార్గదర్శకత్వం ఉపయోగకరంగా ఉంది.

ఏకబిగిన గంటన్నర ప్రయాణం చేశాక అచ్యుత రామయ్య మార్గదర్శకత్వంమీద నాకు అనుమానం కలిగి నమ్మకం సన్నగిల్లింది. ఆసరికి సత్తెనపల్లి ఎప్పుడో వచ్చి

ఉండాల్సింది. రాలేదు. అతగాడు ఎక్కడకు నడిపిస్తున్నాడో నాకు అర్థం కావటంలేదు. ఆమాట ఆయన ముఖం మీద అంటే బాగుంటుందో, బాగుండదో అని మొహమాట పడుతూ, "సత్తెనపల్లికి మరో గంట ప్రయాణముంటుందా?" అడిగాను.

"గంటా? భలేవారే, మరో పది నిమిషాల ప్రయాణమండీ. అదో ఆ కనిపిస్తుందే ఏదీ సత్తెనపల్లి, నేను మీకు చెప్పలేదు కాని. మనం షార్ట్‌కట్‌లో వచ్చాం......." అంటూ ఫిట్ వచ్చిన వాడిలా, "హోల్డాన్" నా చెవులు చిల్లులుపడేలా అరిచాడు. అతని అరుపుకు నా మెదడు బిగుసుకు పోయింది. ఏం జరిగిందో అర్థం కాలేదు. సడన్ బ్రేక్ వేశాను. హఠాత్ పరిణామానికి మరో రోడ్డయి ఉంటే తట్టుకోలేక బస్సు కిందపడిపోయి ఉండేదే, రాళ్లరోడ్డు కాబట్టి తట్టుకుంది. బస్సులో ఉన్నవాళ్లకు దెబ్బలు తగిలి ఉండేయి. తిట్టటం మొదలు పెడతారు. నా కాళ్లు,చేతులు వణకటం మొదలెట్టాయి. నా గుండె వేగంగా కొట్టుకుంటోంది. నా గొంతులో తడారిపోయి ఏమాటా వెంటనే బయటకు రాలేదు. రుమాలు తీసి ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటూ అతని వైపు చూశాను. అతను చలి జ్వరం వచ్చిన వాడిలా వణికిపోతున్నాడు.

"ఏమయింది?" చిన్నగా అడిగాను.

"బస్సు కింద ఎవరో పడ్డారు."

నా గుండెలో రాయి పడింది. నేను కూర్చున్న మేర బస్సు విడివడి కిందకు జారిపోతున్నట్లుగా అనిపించసాగింది. పోలీసులు వస్తారు, నన్ను అరెస్టు చేస్తారు. ఉద్యోగం లోంచి సస్పెండ్ చేస్తారు.

అతనే తిరిగి అన్నాడు, "మీరు నా వైపు తిరిగి మాట్లాడుతున్నారు కదా, తెల్లటి గుడ్డలు వేసుకున్న ఒకతను....... భగవంతుడా, అతను చక్రాల కింద నలిగి చనిపోయిఉంటాడు....... అందుకే హోల్డాన్ అని అరిచాను."

అతని వణుకు తగ్గింది కాని నాకు దడ ఎక్కువవుతోంది. హెడ్‌లైట్ లేకుండా నడపటం చిన్న అపరాధంగా తీసుకోరు. మా డిపో మేనేజరు నాకు ఏ విధంగానూ సహాయం చేయడు. బస్సులో ఉన్న ప్యాసింజర్లు నన్ను చితక బాదినా ఆశ్చర్యపోను. ఏమైందో వాళ్లకింకా అర్థమైనట్టు లేదు. పట్టుకుని నన్ను కొట్టక ముందు పరుగెత్తి పారిపోయి దగ్గరున్న ఏ పోలీసు స్టేషనుకో వెళ్లటం మంచిది. నా కుడివైపున్న హ్యాండిల్ పట్టుకున్నాను.

"ఏమయింది గురో?" అడిగాడు ఆంజనేయులు.

"ఒక్క నిమిషం ఇలారారా అబ్బాయ్."

"వస్తున్నా" మాట వెనకనే వచ్చాడు.

"బస్సు కింద ఎవరో పడ్డారట, వెళ్లిచూడు" అన్నాను చిన్నగా. నా కంఠస్వరం నాకే కొత్తగా వినిపించింది. ఆంజనేయులు ఏదో అనబోతుంటే "ముందు చూసిరారా" అన్నాను విసుగ్గా. కిందకు దిగాడు. స్టీరింగు వీల్‌మీద మోచేతులుంచి చేతుల్లో ముఖం పెట్టుకుని కళ్లు మూసుకున్నాను. నా గుండె కొట్టుకునే చప్పుడు నాకే స్పష్టంగా వినిపిస్తోంది. అతనేం చెబుతాడో నేనూహించగలను. బస్సు కింద పడిన మనిషి నుజ్జునుజ్జు అయి ఉంటాడు. ఆంజనేయులు మాట వినటం తరువాయి, నేను బస్సులో ఉండకూడదు. ఎంత త్వరగా దిగిపోతే అంత మంచిది. కళ్లు తెరిచి తలుపు తీసి పట్టుకున్నాను.

"గురో...... బస్సు కింద ఎవరూ పడలేదు" అబద్ధం చెబుతున్నాడేమో అనిపించింది.

"సరిగ్గా చూడు" నీళ్లలో మునుగుతున్న నన్ను ఎవరో పైకి లాగినట్లు అనిపించింది.

"వెనక్కి వెళ్లి చూడు" సంతోషంతో నా కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి.

"చూశాను. ఎవరూ చావలేదు. మనిషి పడ్డాడని నీతో అన్నది ఎవరసలు?" అని వెంటనే సంతోషంతో, "గురో సడన్ బ్రేక్ వేయటం వల్లనేమో హెడ్‌లైట్లు వెలుగుతున్నాయి" అరిచాడు ఆంజనేయులు.

అతని మాటలకు వళ్లు పులకరించినట్లయింది. అద్దంలోంచి బయటకు చూశాను. లైట్లు పడినంతమేర దారి కనిపిస్తోంది.

నాకు అంతకంటే ఆశ్చర్యం కలిగించిన విషయం ఏమిటంటే గంటన్నర ప్రయాణం తర్వాత బస్సు తిరిగి పెదకూరుపాడు పొలిమేరల్లో తేలటం! తర్వాతి పక్కా ట్రిప్‌లో అచ్యుతరామయ్య బస్సు ఎక్కలేదు. అతనాఊరి ప్రెసిడెంటో, మాజీ ఎం.ఎల్.ఏనో, ప్రస్తుతం ఎం.ఎల్.ఏనో అయి ఉండినా నేను ఆశ్చర్యపోను.

◆ ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 3 జనవరి 1975